క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో మహాగణపతి



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవాలయంలో శ్రీ మహాగణపతి స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనచ్చారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

గిరిజన ఉద్యోగుల సభను జయప్రదం చేయండి

పిడుగురాళ్లరూరల్: పట్టణంలోని అభయాంజనేయస్వామి కల్యాణ మండపంలో పల్నాడు జిల్లా గిరిజన ఎంప్లాయిస్ యూనియన్ సమ్మేళనం, జిల్లా కార్యవర్గ ఎన్నిక నిర్వహించటం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.బాలునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివారం జరుగుతుందన్నారు. సభ్యులందరూ తప్పక హాజరుకావాలన్నారు.

మైనర్లను కార్మికులుగా మారిస్తే చర్యలు



పిడుగురాళ్ల: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్మిక శాఖ అధికారిణి జి.నాగరాజ అన్నారు. పట్టణంలోని సున్నపు బట్టీలు, ఇటుక బట్టీలు, ప్లాస్టిక్ తయారీ చేసే సంస్థల్లో తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వెట్టిచాకిరి నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించటం జరిగిందన్నారు. మైనర్లను కార్మికులుగా మారిస్తే సహించేది లేదని సంస్థల యాజమాన్యాలకు హెచ్చరించారు. కార్మికశాఖ అధికారులు బి.కోటేశ్వరరావు, గౌతమి, మంగమ్మ, ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్కే అబ్దుల్ రషీద్ తదితరులు ఉన్నారు.

ఏపీఆర్‌జేసీకి 60 సీలింగ్ ఫ్యాన్‌లు వితరణ



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలకు కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ చీఫ్ ఇన్‌కంటాక్స్ కమిషనర్ పురుషోత్తం బుధవారం 60 సీలింగ్ ఫ్యాన్‌లను ప్రిన్సిపాల్ సరోజినికి అందజేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. సాగర్ పరివార్ కార్యదర్శి డాక్టర్ వీరనంది, ఉపాధ్యక్షుడు సైదారెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్, ఎన్ఆర్ఐ కన్వీనర్ శాఖ, గొంతిన రమేష్, అధ్యాపకులు చందు ఆంజనేయులు, చంద్రశేఖర్, లింగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ షమీముల్లాకు సత్కారం



మాచర్ల రూరల్: కత్తి మీద సాములాంటి పోలీసు ఉద్యోగంలో శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు సత్వరమే న్యాయం చేసేలా ఉత్తమ సేవలు అందించిన రూరల్ సీఐ షేక్ షమీముల్లా జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకోవటం అభినందనీయమని మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ జలీల్ అన్నారు. బుధవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ షమీముల్లాను వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా శాలువా, పూలమాలతో సత్కరించారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ సుభాని, షేక్ దస్తగిరి, సీలింగ్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ కరిముల్లా, షేక్ అల్లావుద్దీన్, నాగూర్, మీరా తదితరులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

విజయపురిసౌత్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన బుధవారం విజయపురిసౌత్‌లో చోటు చేసుకుంది. స్థానిక డౌన్ మార్కెట్‌కు చెందిన గరికెన నాగేశ్వరావు ఊరెళ్లగా, కొడుకు కాశిబాబు ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు హుటాహుటిన ఇంటి వద్దకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న డబ్బులు, వలలు, ఫ్రిడ్జ్, టీవీ, దుస్తులు, సరుకులు, వంటసామగ్రి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన ఇంటిని పరిశీలించారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.



నరసరావుపేటలో ఎంపీ విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఎంపీ విజయసాయిరెడ్డికి నరసరావుపేట పట్టణ శివారులో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు

మాచర్ల రూరల్: ప్రపంచ దేశాలు చంద్రయాన్-3 ల్యాండింగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయంలో మండలంలోని కంభంపాడు గ్రామంలో జెడ్పీ హెచ్ స్కూల్ విద్యార్థులు చంద్రయాన్-3 విజయవంతం కావాలని కాంక్షిస్తూ ఇస్రో ఆంగ్ల అక్షరాలలో మానహారంగా ఏర్పడడం అందరినీ ఆకట్టుకున్నారు. జాబిల్లిపై ఇంతవరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువం పై విక్రమ్ ల్యాండర్ కాలుమోపిన క్షణాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షధ్వానాల నడుమ జై భారత్.. జయహో భారత్ అంటూ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఇస్రో పేరుతో మానవహారంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు తెడ్ల నాగమురళిని పలువురు అభినందించారు. హెచ్ఎం రామిరెడ్డి విజయకుమారి, ఉపాధ్యాయులు ప్రసాద్, రాము, సైదమ్మ, ప్రభావతి, రజని, అబ్దుల్ జబ్బార్, హనిమిరెడ్డి, వెంకటేశ్వర్లు జి.కర్తయ్య ఉన్నారు.

మాచర్లలో...

మాచర్ల: చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్-3 ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. టీవీలు, సామాజిక మాధ్యమాల్లో ఈ దృశ్యాలను చూసిన ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. మాచర్ల పట్టణ రెవెన్యూ, పురపాలక సంఘ, విద్యా శాఖ అధికారులు, స్పెషలాఫీసర్ పురపాలక సంఘం కార్యాలయాల్లో బిగ్ స్క్రీన్‌లపై ల్యాండింగ్ ప్రక్రియ ప్రత్యక్షప్రసారాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక, బాలుర, ఎంపీపీ, ఎంపీయూపీ, ప్రైవేటు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి జయజయధ్వానాలు చేశారు. ఉత్కంఠతో తిలకించి ప్రజలు చంద్రుని పై చంద్రయాన్ – 3 దిగటంతో సంబరాలు చేసుకున్నారు.



కంభంపాడు జెడ్పీహెచ్ స్కూల్‌లో చంద్రయాన్ 3 ల్యాండింగ్ దృశ్యాలను వీక్షిస్తున్న విద్యార్థులు

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ ల్యాండింగ్‌ను వీక్షించేలా ఉపాధ్యాయులు అన్ని చర్యలు తీసుకున్నారు. దీంతో చిన్నారులు 6 గంటల వరకు వేచి ఉండి చంద్రయాన్ ప్రయోగం విజయవంతం అయ్యే దాకా ఉండి వీక్షించారు. అనంతరం జయహో భారత్, జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ, సంబరాలు చేశారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో ప్రయోగాన్ని వీక్షించేలా చర్యలు తీసుకున్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు

మాచర్ల: శాస్త్రవేత్తలు చంద్రయాన్ 3ని ప్రయోగించి చంద్రుడిపై విజయవంతంగా ల్యాండింగ్ చేయటం దేశంయావత్తూ గర్వించదగిన విషయమని, ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు బుధవారం పేర్కొన్నారు. పీఆర్కే మాట్లాడుతూ జాబిల్లిపై చంద్రయాన్ 3ని ల్యాండర్‌ను విజయవంతంగా దింపడం మామూలు విషయం కాదన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

టంగుటూరి జీవితం ఆదర్శనీయం

రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం ప్రకాశం పంతులు 152వ జయంతిని పురస్కరించుకుని స్థానిక తన కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించి మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో ఒక ధ్రువతారగా వెలుగొంది ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ఎంతో కీలకపాత్ర పోషించారని, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికి ఎదురునిలిచిన పోరాటయోధుడని కొనియాడారు. ప్రకాశం పంతులు ధీరత్వాన్ని చూసిన దేశ ప్రజలు అప్పటినుంచి ఆయనను ఆంధ్రకేసరిగా పిలవడం ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుంటా ముక్కంటీశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులున్నారు.

దుర్గిలో... దుర్గి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.సమతా వాణి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ జీఎల్ఎన్ గుప్తా, ఏఓ శివ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మాచవరంలో...

మాచవరం: ఆదర్శనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎంపీడీఓ యు.వరప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, సచివాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య, ఈఓపీఆర్డీ వెంగళరావు, పీఆర్ వెంకటేశ్వరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా పని చేస్తోంది

డీఎస్పీ పల్లపురాజు

రెంటచింతల: పోలీసు వ్యవస్థ నిష్పక్ష పాతంగా పని చేస్తోందని గురజాల డీఎస్పీ పి.పల్లపు రాజు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసు పైఅధికారులు స్టేషన్‌లో కూర్చుని ఇరువర్గాలకు రాజీ చేశారని కొన్ని పత్రికలలో(సాక్షి కాదు) రాసిన కథనాలను ఖండించారు. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆరుగురితో ప్రాణహాని ఉందని టీడీపీకి చెందిన సర్వారెడ్డి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సర్వారెడ్డితో పాటు మరికొందరు టీడీపీ వారు తమపై దాడి చేసేందుకు ఘర్షణ పడుతున్నారని రెంటాల గ్రామానికే చెందిన వైఎస్సార్ సీపీ వర్గీయులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చి ఫిర్యాదు చేశారన్నారు. ఇరువర్గాల వారు కూడా సమీప బంధువులేనన్నారు. మేమంతా కలసి కుర్చొని మాట్లాడుకుని రాజీ పడతామని చెప్పి ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కు తీసుకుని రాజీపడినట్లు వివరించారు. గురజాలలో కూడా ఓ బీట్ కానిస్టేబుల్, మరో మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్ ఇద్దరూ కలసి అక్కడ జరిగిన వివాదాన్ని పరిష్కరించేందుకు రెంటచింతల ఎస్ఐకు సమాచారం అందించారని చెప్పారు. ఈ సమయంలో వారి ఇద్దరు టీడీపీ, వైఎస్సార్ సీపీలకు చెందిన వారని ఆ కానిస్టేబుల్స్‌కు తెలియదని పేర్కొన్నారు. ఎక్కడ కూడా సర్వారెడ్డిని బెదిరించి కేసు వాపస్ తీసుకోమని చెప్పలేదని కేవలం వారి అభ్యర్థన మేరకే కేసు నమోదు చేయకుండా పెండింగ్‌లో ఉంచినట్లు వివరించారు. వెల్దుర్తి మండలం మండాది గ్రామంలో ఇటీవల సర్వారెడ్డి, శ్రీనివాసరెడ్డి మధ్య నర్సరీ విషయంలో గొడవ జరిగి కోటి రూపాయల విలువైన మిర్చి మొక్కలపై విష ప్రయోగం కేసులో సర్వారెడ్డిని అరెస్టు చేయడం జరిగిందని, శ్రీనివాసరెడ్డి కూడా ఈ కేసులో నిందితుడు ఉన్నట్లు చెప్పారు. ఈ కేసు విషయంలో శ్రీనివాసరెడ్డి బెయిల్ కోసం ప్రయత్నించగా హైకోర్టు వెల్దుర్తి పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టాలని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరెడ్డి వెల్దుర్తికి వెళ్తే తనపై దాడి జరిగే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి అర్జీ పెట్టుకోగా దీనిపై విచారించిన ఎస్పీ, వెల్దుర్తి ఎస్ఐని పిడుగురాళ్ల పోలీసు స్టేషన్‌కు వచ్చి శ్రీనివాసరెడ్డి దగ్గర సంతకం తీసుకునేలా చర్యలు చేపట్టారనే విషయాన్ని గుర్తు చేశారు. ఒకే పార్టీకి కొమ్ము కాసేవారిమైతే టీడీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని హైకోర్టు ఆదేశించింది కదా... నీవు వెళ్లి వెల్దుర్తి పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టమని చెప్పేవారమని కాని ఎవరైనా మాకు ప్రాణ భయం ఉందని మా దృష్టికి తీసుకొస్తే కాపాడాల్సిన బాధ్యత మా పోలీసుల విధిధర్మం అన్నారు. అవాస్తవ ఆరోపణలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. సమావేశంలో కారంపూడి సీఐ జయ కుమార్, ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు

ప్రభుత్వ కార్యాలయాల్లో సమీక్షలు

దుర్గి: మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలోని పీహెచ్‌సీ సెంటర్, జెడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడీ కేంద్రాలలో పలువురు మండల స్థాయి అధికారులు బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌లో వైద్యులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో సమీక్ష నిర్వహించి బాధ్యులైన సిబ్బందిని వివరణ అడిగారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలో హాజరు పట్టీలను తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్పెషలాఫీసర్ కె.సంజీవరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత సిబ్బంది పై ఉందన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పలు విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, వైద్యులు నాగరాజు, శివరామకృష్ణ, తదితరులున్నారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నతస్థానాలకు..



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా అభివృద్ధి అధికారి యల్లా మహాలక్ష్మి

మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి

మిట్టగుడిపాడు(రెంటచింతల): కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని పల్నాడు జిల్లా అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మిట్టగుడిపాడు గ్రామ శివార్లోని కస్తూర్బా పాఠశాలన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతస్థానానికి చేరుకుంటారన్నారు. కష్టపడి అత్యున్నతస్థాయికి చేరుకున్న మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడిచి మంచి పౌరులుగా సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. తరగతి గదులలో బోధించే పాఠాలను ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మీకు ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందజేయాలి

మాచర్ల రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ సమయానికి అందేలా అధికారులంతా సమష్టిగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని తాళ్ళపల్లి సచివాలయం, జెడ్పీ హైస్కూల్ వైద్యశాలను సందర్శించి ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను, పీహెచ్‌సీలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారని విద్యార్థులకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సచివాలయ రికార్డులను తనికీ చేశారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు, డాక్టర్ శివలీల, ఎంఈఓలు అల్లి సురేష్, వేముల నాగయ్య, సర్పంచ్ యంద్ర గాలయ్య, మాజీ సర్పంచ్ వెంకట్రామయ్య, కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్యలున్నారు.



చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం

కారెంపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులు అంతర్గత మురుగు నీటి పారుదలకు తూములు ఏర్పాటు చేశారు. రెండురోజులుగా జరుగుతున్న పనులు బుధవారంతో ముగిశాయి. గ్రామంలో నుంచి వచ్చే డ్రైనేజీ నీరు పోలీస్ కాంప్లెక్స్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు దిగువ నుంచి తూర్పునకు పోవాల్సి ఉంది. అయితే గతంలో ఉన్న పైపులు చిన్నవి కావడంతో వ్యర్థాలతో అవి పూడిపోయి చిన్నపాటి వర్షానికి సైతం రోడ్డు జలమయం అవుతోంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు పెద్ద తూములను తెప్పించి రోడ్డు దిగువన అమర్చారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధం చేసుకుంటూ పొక్లెయినర్లు, కూలీలతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేయించారు. చిరకాలంగా ఉన్న సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులు పరిష్కారం చేశారు.



కొనసాగిన తూములు అమర్చే పనులు

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

దాచేపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ పినాకపాణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఏలియంపేట కాలనీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టికలు పరిశీలన చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల విద్యాబోధన గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి జగనన్న గోరుముద్దను రుచిచూశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పినాకపాణి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. హెచ్ఎం వట్టిపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయురాలు పద్మావతి, సీఆర్పీ అబ్రహాం తదితరులున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ పినాకపాణి

ఉత్తమ ఆపరేటర్ అనిల్‌కు సన్మానం



దుర్గి: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అనిల్‌కు స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ ఆపరేటర్‌గా ప్రతిభా పురస్కారం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.రమేష్ కుమార్ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని వేళలా సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేయటం ఉద్యోగి ధర్మం అన్నారు. అనిల్‌ను శాలువతో సత్కరించి మెమెంటోను బహుకరించారు. వీఆర్ఓలు టి.జీరయ్య, రంగారావు, కోటేశ్వరరావు, గంగమ్మ, పద్మావతి, తులసీనాయక్, సోమ్లానాయక్, నియోజకవర్గ మండల ఆపరేటర్లు సైదా బి.చంద్రం, మధు, జాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

సత్తెనపల్లి: పౌర్ణమి పురస్కరించుకొని సత్తెనపల్లి పరిసర ప్రాంత ప్రయాణికులకు, యాత్రికులకు అరుణాచలేశ్వర స్వామి దర్శనం, గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్ సర్వీస్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పౌర్ణమి సందర్భంగా ఈనెల 30న మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లి నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. సెప్టెంబర్ 1న తిరిగి సత్తెనపల్లి చేరుతుందన్నారు. రాను, పోను చార్జీ రూ.1,900 నిర్ణయించడం జరిగింద న్నారు. అలాగే ఈ నెల 25న సత్తెనపల్లి నుంచి అరకు వ్యాలీకి రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ నడుపుతున్నామన్నారు. విశాఖపట్నం మీదుగా టైడా జంగిల్ బెల్స్, బొర్రా గుహలు, గాలికొండ వ్యూపాయింట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్, అరకు వ్యాలీ, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, అరకు నందు ఆ రాత్రి బస చేసి మరుసటి రోజు ఉదయం విశాఖపట్నం చేరి కైలాసగిరి, ఆర్కే బీచ్ మీదగా సింహాచలం దర్శనం అనంతరం బయలుదేరి 28న ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. దీనికి రాను పోను చార్జి రూ.2,800 నిర్ణయించడం జరిగింద న్నారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనలు బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా యాగశాలలు, శాంతిపాఠం, నిత్యపూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. ట్రస్ట్ చైర్మన్ పాత్తూరి వెంకట రమణసుబ్బారావు పర్యవేక్షించారు.